

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు పరామర్శ

గడ్డి పెద్దాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాచారం గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులను మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ముగ్గురు బాధిత కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ రూ. ఐదు వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట బాచారం గ్రామ మాజీ సర్పంచ్ వెంకట రాములు, దుర్గయ్య ఉన్నారు.

-పాపన్నపేట, ఫిబ్రవరి 20

ప్రభుత్వ భూములను సర్వే చేయాలి

చేగుంట, ఫిబ్రవరి 20 : మండలం పరిధిలోని చిన్నశివునూర్ శివారులోని 55 సర్వే నంబర్‌లోని 67 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేయాలని గ్రామస్తులు కోరారు. అన్యాక్రాంతం కాకుండా హద్దులు ఏర్పాట్లు చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ కోటారి అశోక్ ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

రామాయంపేట రూరల్, ఫిబ్రవరి 20 : రామాయంపేట నుంచి గజ్వేల్ వరకు వెళ్లే రోడ్డులో ప్రతి రోజు వందవాహనాలు నడుస్తాయి. మండల పరిధిలోని సుతారిపల్లి గ్రామ స్టేజీ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ స్టేజీ వద్ద నార్సింగి మండలం నుంచి గజ్వేల్ వైపు నుంచి, రామాయంపేట నుంచి వాహనాలు వేగంగా వస్తుంటాయి. అయితే ఈ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎదురుగా మూల మలుపు వద్ద అడుపు చేయకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం స్పీడ్ బ్రేకర్లు ఉంటే ప్రమాదాలు అరికట్టవచ్చని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సుతారిపల్లి స్టేజీ వద్ద నార్సింగి వెళ్లే రోడ్డు బస్టాండ్ ఉండటం వల్ల అటువైపు నుంచి వచ్చే వారు స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదకరంగా రామాయంపేట -గజ్వేల్ వెళ్లే రోడ్డు

కష్టపడ్డ కార్యకర్తలకు ప్రత్యేకస్థానం

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



బీఆర్ఎస్ చేగుంట మండలాధ్యక్షుడు నారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి 20: బీఆర్ఎస్ చేగుంట మండలాధ్యక్షుడిగా ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన కోమండ్ల నారాయణరెడ్డి నియామితులయ్యారు. చేగుంటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశంలో మండలాధ్యక్షుడిగా నారాయణరెడ్డి ఏకగ్రీవంగా నియామితులయ్యారు. నూతనంగా ఎన్నికైన నారాయణరెడ్డిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడిన వారికి పార్టీలో ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. నాయకులు మనోహర్‌రావు, జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మంచికట్ల శ్రీనివాస్, నాయిని రాజ్‌గోపాల్, దొరగొల్ల రాములు, లచ్చిరెడ్డి, సాయికుమార్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

కర్నాల్‌పల్లి శ్రీభక్తాంజనేయ షిర్డీ సాయిబాబా దేవాలయ వార్షికోత్సవ ఉత్సవాలకు రావాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. చేగుంట మండల పరిధిలోని శ్రీభక్త అంజనేయ షిర్డీ సాయిబాబా దేవాలయ వార్షిక కోత్స వేడుకలు ఈ నెల 22 నుంచి 24తేదీ వరకు జరుగనున్నందున వేడుకలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, దేవాలయ అన్నదాన కమిటీ చైర్మన్ కేఆర్.మధుసుదన్‌రెడ్డి, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మ యాదగిరి, నాయకులు వంటరి అశోక్‌రెడ్డి, బాల్‌శివ, లోకశ్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బస్సు, ట్రాక్టర్, ఆటో ఢీ

పలువురికి గాయాలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 20 : ట్రావెల్ బస్సు, ట్రాక్టర్, ఆటోలను ఢీకొన్న ఘటనలో పలువురికి స్వల్పగాయాలైన ఘటన మండల కేంద్రమైన మాసాయిపేట గ్రామశివారు బంగారమ్మ ఆలయం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ వైపు నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు బంగారమ్మ ఆలయ సమీపంలో ట్రాక్టర్, ఆటోలను ఢీకొనగా, ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు ఆటోలో ఉన్న పలువురికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చేగుంట పోలీసులతో పాటు 108కు సమాచారం అందించగా, క్షతగాత్రులను తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

'పేట'లో పంటల నమోదు పూర్తి

వివరాలు నమోదు చేస్తున్న అధికారి రాజ్ నారాయణ

రామాయంపేట, ఫిబ్రవరి 20: రామాయంపేట మండల వ్యాప్తంగా సుమారు 15వేల ఎకరాల భూమి సాగుకు అనుకూలంగా ఉండగా, యాసంగిలో 13,687 ఎకరాల్లో పంటలను రైతులు వేసుకున్నారని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ తెలిపారు. మంగళవారం రామాయంపేట మండలంలోని దంతెపల్లి, పర్వతాపూర్, కిషన్ తండా, కాట్రియాల తదితర గ్రామాల్లో పంటల సాగు సర్వేను పూర్తి చేశారు. ఇప్పటి వరకు రైతులు 12650 ఎకరాల్లో వరి సాగు చేయగా, 748 ఎకరాల్లో మొక్కజొన్న పంట, 12 ఎకరాల్లో సన్‌ఫ్లవర్, 277 ఎకరాల్లో ఇతర అంతర పంటలను రైతులు మండల వ్యాప్తంగా సాగు చేశారని అన్నారు. ఇప్పటివరకు అన్ని గ్రామాలను పర్యటించి సర్వేలను పూర్తి చేశామని తెలిపారు. అనంతరం గ్రామాల్లోని క్లస్టర్ పరిధిలోని రైతువేదికలో రైతులకు పలు సూచనలు సలహాలిచ్చారు. మండల వ్యాప్తంగా యాసంగిలో 15వేల ఎకరాల్లో సాగులో ఉందని మండలంలో ఉన్న రైతులంతా సాగులో ఉన్న భూమిలో 13687 ఎకరాల్లో పంటలను వేశారన్నారు. పంటలకు ఏమైనా తెగుళ్లు వ్యాపిస్తే వెంటనే వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు రైతులు ఫోన్ చేయాలన్నారు. పీఎం కిసాన్ కోసం రైతులు కచ్చితంగా ఈ కేవైసీని చేసుకోక తప్పదన్నారు. వ్యవసాయ శాఖ రైతుల సేవలోనే ఉంటుందని ఎప్పుడైనా రైతులు అధికారులకు ఫోన్లు చేసి తమ పంటలు పురుగుల బారిన పడితే వెంటనే అప్పుచెప్పాలన్నారు. పురుగు మందు ఏవిధంగా వాడాలో వ్యవసాయశాఖ అధికారులు సూచనలు చేస్తారన్నారు. అధికారి వెంట ఏఈవోలు సాయికృష్ణ, రాజు నాయక్, రాజు, రైతులు ఉన్నారు.

ట్రైనీ కానిస్టేబుళ్లకు కిట్లను అందజేస్తున్న ఎస్పీ డాక్టర్ బాలస్వామి

కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి

- **ఎస్పీ డాక్టర్ బాలస్వామి**

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 20: పోలీస్ శాఖకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ట్రైనీ కానిస్టేబుళ్లకు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో నూతనంగా పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికై శిక్షణార్థం వివిధ ట్రైనింగ్ సెంటర్లకు వెళ్తున్న152 మంది లో మహిళా కానిస్టేబుళ్లు 39, మిగతా వారు 113 మందికి సంబంధించి ఎస్సీటీపీసీ కిట్ ఆర్టికల్స్ పంపిణీ చేసి శిక్షణకు పంపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రైనీ కానిస్టేబుళ్లకు శిక్షణ సమయంలో మానసికంగా, శారీరకంగా వివిధ అంశాలపై అవగాహన ఉంటుందని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, డీసీఆర్‌బీడీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చేగుంటలో దొంగల హల్‌చల్

చేగుంట, ఫిబ్రవరి 20: చేగుంటలో పట్ట పగలే దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. ఇంటి ముందు పెట్టిన కారు అద్దాలు పగుల గొట్టి రూ.5 లక్షలు ఎత్తుకెళ్లిన సంఘటన మరువక ముందే, చేగుంట బైపాస్ బ్రిడ్జి వద్ద పోలీసులమని చెప్పి దొంగలు నిలువు దోపిడీ చేశారు. దీంతోపాటు నార్సింగిలో తాళం వేసిన మూడు ఇండ్లను లూటీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి గోత్రల శ్రీకాంత్, పంపరి జనార్దన్, బోడ భూపాల్ ఇండ్లలో దొంగలు చొరబడ్డారు. సోమవారం చేగుంట బైపాస్ బ్రిడ్జీ వద్ద ఇద్దరు దొంగలు పోలీసులమని చెప్పి రెడ్డిపల్లి నుంచి చేగుంట వైపు స్కూటీపై వస్తున్న దొడ్ల రామచంద్రాన్ని బెదిరించి రెండు ఉంగరాలు, చైను లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ, రామాయంపేట సీఐ, ఎస్సైలు పరిశీలించారు.

రామాయంపేటలో..

రామాయంపేట, ఫిబ్రవరి 20 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం రామాయంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. పట్టణంలోని మంజీరా కాలనీలో నివాసం ఉంటున్న గంధం చంద్రయ్య దంపతులు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలో ఉన్న రూ. 5.30 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. సమాచారం మేరకు పోలీసులు విచారిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు త్వరలో నే వెల్లడిస్తామని తెలిపారు.

చిన్నాఘన్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎజాజ్ సుల్తానా పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు ఎం.సీతారాములు, రమణ, వి.సంగయ్య, సిద్ధిరాములు, మహేశ్, జరీనా, సుగుణ, రుక్మేశ్ పాల్గొన్నారు.

- కొల్చారం, ఫిబ్రవరి 20

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

రామాయంపేట, ఫిబ్రవరి 20: పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని అఖిలభారత విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం రామాయంపేట కళాశాలల విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యార్థి నాయకుడు ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వకుండా విద్యార్థులను మనోవేదనకు గురిచేస్తున్నదని వెంటనే ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నరేశ్, సాయి భరత్, రోహిత్ మధు, భాణు, దినేశ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలి

పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో సూర్యారావు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 20: మహిళలు తమ లక్ష్యాలను ఏర్పరచుకొని జీవనోపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని అడిషనల్ డీఆర్డీవో సూర్యారావు అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో పెద్దశంకరంపేట,రేగోడ్, మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, వీవోఏల లఘుపతి దీదీ శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. శిబిరంలో డీపీఎం మోహన్, ఎపీఎంలు గోపాల్, రుక్మిణి, సంగీత, సీసీలు నిరంజన్, మోహన్, రాములు, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టి కోసం దరఖాస్తు చేసుకోండి

మెదక్ రూరల్, ఫిబ్రవరి 20 : ఇసుక, మట్టి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ ఇసుక మట్టి తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంటి నిర్మాణానికి ఇసుక అవసరం ఉన్న వారు మైనింగ్ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టా భూమితో పాటు ఎక్కడ నుంచి మట్టితరలిస్తారు అనే వివరాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, వారికి అనుమతి ఇస్తామన్నారు. ఇసుక కొరతపై అందోళన అవసరం లేదని దరఖాస్తు ఇచ్చిన వెంటనే అనుమతులు ఇస్తామని వెల్లడించారు.

పెరిగిన కరువు భత్యాన్ని అమలుచేయాలి

చేగుంట, ఫిబ్రవరి 20 : కర్నాల్‌పల్లి బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యాన్ని ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయాలని హిందూ మస్తుర సభ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇదారి మల్లేశం తెలిపారు. మంగళవారం చేగుంటలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల వారికి కరువు భత్యం పెరిగిందని, దీంతో పాటు నెలసరి ఉద్యోగులకు, బీడీ ప్యాకింగ్ కార్మికులకు కూడా పెరిగిన కూలీరేట్లను తప్పనిసరిగా యాజమాన్యం అమలు చేయాలని వారు కోరారు. సమావేశంలో ఇదారి మల్లేశంతో పాటు అసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధు, కార్యదర్శి లక్ష్మణ్ ఉన్నారు.

మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇదారి మల్లేశం

రామాయంపేటలో రేణుకాఎల్లమ్మకు బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

ఘనంగా రేణుకామాతా కల్యాణం

రామాయంపేట, ఫిబ్రవరి 20 : పట్టణంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో ఘనంగా కల్యాణాన్ని నిర్వహించారు. మంగళవారం మల్లికార్జునస్వామి జాతరలో భాగంగా ఆలయంలోని ఎల్లమ్మకు పట్నాలు గీసి కల్యాణ కార్యక్రమాలను చేపట్టారు. పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వాహకులు రేణుకా ఎల్లమ్మకు పట్టువస్త్రాలను అందజేశారు. డప్పు చప్పుల్లతో బోనాలను ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో ఒగ్గు కళాకారులతో ఒగ్గు కథలను చెప్పించారు. దేవాలయం చుట్టూరా బండ్ల ప్రదర్శన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మల్లన్న స్వామి, ఎల్లమ్మ దేవతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, రాజు యాదవ్ పాల్గొన్నారు.

అమ్మకు బోనం.. ఉప్పొంగిన భక్తిభావం

చిలిపిచెడ్, ఫిబ్రవరి 20 : మండలంలోని గౌతాపూర్‌లో ఘనంగా దుర్గామాత, పోచమ్మదేవి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం గ్రామంలో హోమాలు, బోనాల ఊరేంగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాలు కొనసాగాయి. గ్రామంలోని ప్రజలు భక్తిశద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ స్వరూపావిఠల్, మాజీ ఉప సర్పంచ్ అక్షయ గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భీమయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



గౌతాపూర్‌లో దుర్గామాత, పోచమ్మదేవికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

రామాయంపేట, ఫిబ్రవరి 20: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంకష్టహర చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆలయ కమిటీ అధ్వర్యంలో మంగళహారతులు, నైవేద్యాలను భక్తులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లకీని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా కనిపించాయి.

నేడు మున్సిపాలిటీ దుకాణాల బహిరంగ వేలం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రం మెదక్‌లోని పాత బస్టాండ్ ఎదురుగా మున్సిపాలిటీకి చెందిన 17 దుకాణాలకు బుధవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జానకీరామ్‌సాగర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు ఫారం రసీదు, ఆధార్‌కార్డుతో బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

పరిస్థితి విషమించి యువకుడు మృతి

తూప్రాన్, ఫిబ్రవరి 20: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తూప్రాన్ పట్టణానికి చెందిన అర్కల వంశీ (25) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన అర్కల వంశీ కొంపల్లిలో ఓ శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణమయ్యాడు. ఆదివారం అర్ధరాత్రి కొంపల్లి ట్రిబ్జి సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారమందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని కొంపల్లిలోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్చారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి చికిత్స ప్రారంభించారు. సోమవారం ఉదయం వంశీ శరీరం చికిత్సకు స్పందించకపోవడంతో బ్రెయిన్‌డెడ్ అయి మృతిచెందినట్లుగా నిర్ధారించారు. అక్కడి నుంచి మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. అక్కడి వైద్యులు హార్ట్‌బీట్, పల్స్ కొట్టుకుంటున్నాయని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. అక్కడ నుంచి మరో దవాఖానాకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. వంశీకి 8 నెలల క్రితం వివాహమవ్వగా భార్య 4 నెలల గర్భిణి, తల్లి రోధించిన తీరు పలువురిని కలిచివేసింది.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు

కొల్చారం, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని పోతంశెట్‌పల్లి రైతువేదికలో ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రకృతి వైపరీత్యాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం విద్యార్థులు, రైతులకు అవగాహన కల్పించారు. తుఫాన్లు, వరదలు, భారీ వర్షాలు, భూకంపాలు, మానవ తప్పిదాల వల్ల జరిగే రైలు ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, జల ప్రమాదాలు, బ్రిడ్జీలు, పెద్ద భవనాలు కూలిపోయే సందర్భాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు ప్రయోగాత్మకంగా పరికరాలను చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొల్చారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కొరబోయిన మంజుల కాశీనాథ్, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీ నర్సింహులు, కొల్చారం తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, కొడిపల్లి ఏడీఏ పుణ్యపతి, మండల వ్యవసాయాధికారి శ్వేతకుమారి, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

నిజాంపేట, ఫిబ్రవరి 20 : మండలంలోని చల్మెడలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి విద్యుత్ అధికారులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ చల్మెడలో విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేయాలని గతంలో కలెక్టర్‌ను కోరామన్నారు. ఈక్రమంలోనే అధికారులు మంగళవారం చల్మెడకు వచ్చి సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు రామాయంపేట ఏడీఈ సుధాకర్, కన్‌స్ట్రక్షన్ ఏఈ నారాయణ, సివిల్ ఏఈ శ్రీకాంత్, నిజాంపేట ఏఈ గణేశ్, లైన్‌మెన్ బాలయ్య, గ్రామస్తులు కిష్టయ్య, రమేశ్ ఉన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

తూప్రాన్, ఫిబ్రవరి 20 : నేర చరిత్ర కల్గిన వ్యక్తులు ఇకమీదట సత్ప్రవర్తన కలిగి ఉండాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళవారం తూప్రాన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి, శివ్వంపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సుమారు 50 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తూప్రాన్ సీఐ ఆర్.కృష్ణ, ఎస్సై శివానందం, మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్ రెడ్డి, శివ్వంపేట్ ఎస్సై మహిపాల్‌రెడ్డి, వెల్దుర్తి ఎస్సై నవతగౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా వీడ్కోలు

పాపన్నపేట, ఫిబ్రవరి 20 : విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి కళాశాలకు మంచి పేరు తేవాలని పాపన్నపేట ప్రభు త్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహులు అన్నారు. మంగళవారం పాపన్నపేట జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, సంతోశ్, జూలకంటి శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రమేశ్, సంధ్యారాణి, అరుణ, విజయ్, రాములు పాల్గొన్నారు.

పాపన్నపేట జూనియర్ కళాశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నీటమునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, ఫిబ్రవరి 20 : మంజీరానదిలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రామతీర్థం శివారులోని మంజీరానదిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కట్ట ప్రభాకర్ (25) హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 15న ప్రభాకర్ పాపన్నపేట మండల పరిధిలోని నామాపూర్‌లో ఉంటున్న సోదరి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. 19న చేపలు పట్టడానికి రామతీర్థం శివారులో మంజీరానది వద్దకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీట మునిగాడు. స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. అప్పటికే రాత్రి కావడంతో ఎంత గాలించినా ఫలితం లేకుండాపోయింది. మంగళవారం ఉదయం గజ ఈతగాళ్ల సాయంతో మృత దేహాన్ని వెలికితీశారు. పంచనామా నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. భర్త మృతిపై అనుమానం ఉందని భార్య సంతోషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు..

రామాయంపేట రూరల్, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని కాట్రియాలలో రైతు ద్యాగల శ్రీనివాస్ (30) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ మంగళవారం ఉదయం పొలానికి వెళ్లాడు. నీరు పెట్టడానికి స్టార్టర్ ఆన్‌చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రామాయంపేట ఎస్సై రంజిత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. శ్రీనివాస్‌కు భార్య గంగమణి, కుమారుడు అభిషేక్, కూతురు సహస్ర ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిస్థితి విషమించి జూనియర్ అసిస్టెంట్..

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 20 : ట్రాక్టర్‌ను ఢీకొని హెల్త్ జూనియర్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన మెదక్ పట్టణంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. మెదక్ సీఐ దిలీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన సుజిత్ (22) కౌడిపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. స్థాన